క్లుప్తంగా

ఘనంగా బంగారమ్మ ఆలయ వార్షికోత్సవం



బంగారమ్మ తల్లిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్, తదితరులు

సింహాచలం : పెందుర్తి మండలం పినగాడిలో ఉన్న బంగారమ్మ తల్లి ఆలయ ప్రథమ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. భక్తులు విశేషంగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. పసుపు, కుంకుమ సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారిని పెందుర్తి ఎమ్మెల్యే అదీప్‌రాజ్, జెడ్పీటీసీ సభ్యురాలు ఉప్పిలి దేవి, పినగాడి సర్పంచ్ బైలపూడి వెంకట లక్ష్మి, వైస్ ఎంపీపీ చిరికి దేముడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు బైలపూడి భగవాన్ జయరామ్ తదితరులు దర్శించుకుని పూజలు చేశారు.

నీట్‌లో వసంత్ ప్రతిభ



కూండ్రపు వసంత్

పరవాడ: ఇటీవల విడుదలైన నీట్ ఫలితాల్లో పరవాడ గ్రామానికి చెందిన కూండ్రపు వసంత్ ప్రతిభకనబరిచాడు. ఆల్ ఇండియా ఓపెన్ కేటగిరీలో 1199 ర్యాంకు సాధించాడు. ఆల్ ఇండియా ఓబీసీ కేటగిరీలో 303 ర్యాంకుతో సత్తా చాటాడు. వసంత్ విజయవాడలోని ఓ ప్రైవేట్ కళాశాలలో చదివాడు. వసంత్ తండ్రి కూండ్రపు అప్పలనాయుడు సింహాద్రి ఎన్టీపీసీలో కాంట్రాక్టు కార్మికుడు కాగా.. తల్లి లక్ష్మి స్థానిక జెడ్పీ బాలికల పాఠశాలలో కాంట్రాక్టు పద్ధతిలో క్రాఫ్ట్ ఇన్‌స్ట్రక్టర్‌గా పని చేస్తున్నారు. కుమారుడు నీట్‌లో ఉత్తమ ర్యాంకు సాధించడంపై వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

'ఆణిముత్యాలకు' సత్కారం నేడు

పరవాడ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన 'జగనన్న ఆణిముత్యాలు' కార్యక్రమాన్ని వెన్నలపాలెం ఏసీ కల్యాణ మండపంలో శుక్రవారం ఉదయం 9.30 గంటలకు నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు తెలిపారు. పెందుర్తి శాసనసభ్యుడు అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ముఖ్యఅతిథిగా పాల్గొని ఇంటర్మీడియట్, పదో తరగతి పరీక్షల్లో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులను సత్కరించనున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

గొర్రెలకు నట్టల నివారణ మందు వేయాలి



పల్లవానిపాలెంలో గొర్రెలకు నట్టల నివారణ మందు అందిస్తున్న డాక్టర్ స్వర్ణలత

సబ్బవరం: పల్లవానిపాలెంలో గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు పంపిణీ కార్యక్రమం గురువారం చురుగ్గా సాగింది. ఈ నెల 30వ తేదీ వరకూ మండలంలోని అన్ని గ్రామాల్లో గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు వేస్తామని వెటర్నరీ డాక్టర్ ఎస్.స్వర్ణలత తెలిపారు. ఈ అవకాశాన్ని గొర్రెల పెంపకందారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నేడు పార్కు ప్రారంభోత్సవం



ఏర్పాట్లు పరిశీలిస్తున్న కార్పొరేటర్ ముమ్మన దేముడు

సింహాచలం : జీవీఎంసీ 95వ వార్డు పరిధి ఎస్ఏడీ లే అవుట్‌లో రూ.82.20 లక్షలతో అభివృద్ధి చేసిన పార్కుని శుక్రవారం ప్రారంభిస్తున్నట్టు కార్పొరేటర్ ముమ్మన దేముడు తెలిపారు. ఇక్కడ కాంపౌండ్ వాల్ నిర్మించి, ఓపెన్ జిమ్, పిల్లల ఆట పరికరాలు ఏర్పాటు చేశారు. వాచ్‌మెన్ రూమ్, మరుగుదొడ్లు నిర్మించారు. ప్రారంభోత్సవ ఏర్పాట్లను గురువారం దేముడు పరిశీలించారు. ఏఈ మూర్తి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, సొసైటీ సభ్యులు అత్తిలి నాగేంద్రకుమార్, సన్యాసిరావు, శేఖర్, భాగ్యలక్ష్మి, రమణమ్మ పాల్గొన్నారు.

ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యం

ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్



ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సింహాచలం : ప్రజల సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించడంతోపాటు, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే ధ్యేయంగా గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నమని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ తెలిపారు. జీవీఎంసీ 97వ వార్డు 506వ నంబరు సచివాలయం పరిధిలోని చాణక్యనగర్, పీఎఫ్ కాలనీ, సమతనగర్‌లో గురువారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్న తీరుని అడిగి తెలుసుకున్నారు. అర్హులైనప్పటికీ సంక్షేమ పథకాలు అందకపోతే సాంకేతిక సమస్యలు సరిచేసి అందేలా చూడాలని వలంటీర్లు, సచివాలయ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ 97వ వార్డు అధ్యక్షుడు మెంటి మహేష్, జోన్ హౌసింగ్ ఏఈ దీపక్, యూసీడీ ఏపీడీ శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీల ఆందోళన



సబ్బవరం ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ సిబ్బంది

సబ్బవరం: అపరిష్కృతంగా ఉన్న సమస్యలు వెంటనే పరిష్కరించాలని మండలంలోని అంగన్‌వాడీ సిబ్బంది గురువారం డిమాండ్ చేశారు. వచ్చే నెల 10న అఖిల భారత కోర్కెల దినం సందర్భంగా సబ్బవరం ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదురుగా అంగన్‌వాడీ సిబ్బంది పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. అనంతరం తమ డిమాండ్లు తెలియజేస్తూ ఐసీడీఎస్ ప్రాజెక్టు సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు ప్రాజెక్టు కార్యాలయం ఎదట నిరసన తెలియజేశామన్నారు. వచ్చే నెల 10న కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం అదనంగా వేతనాలు పెంచాలని కోరారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ ఇవ్వాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేయాలని కోరారు. వీవీ రమణమ్మ, బి.రమణమ్మ, ఆర్.వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

18న వడాయితీ సంప్రోక్షణ

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి ఆలయంలో ఈ నెల 18న వడాయితీ సంప్రోక్షణ నిర్వహించనున్నట్లు సింహాచలం దేవస్థానం ఏఈవో నరసింహరాజు తెలిపారు. ఆ రోజు తెల్లవారుజామున సుప్రభాతసేవ అనంతరం సంప్రోక్షణ ప్రారంభిస్తామన్నారు. ఆలయంలోని అన్ని దేవతా మూర్తుల సన్నిధిల్లో తిరుమంజనం సేవ ఉంటుందన్నారు. మధ్యాహ్నం స్వామికి విశేష ఆరగింపులు ఉంటాయని తెలిపారు. వడాయితీ సంప్రోక్షణ సందర్భంగా 18న సుప్రభాత సేవ, ఆరాధన సేవ టిక్కెట్లు లభించవని తెలిపారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



స్వర్ణ పుష్పాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకులు, అధికారులు, భక్తులు



అప్పన్న ఉత్సవమూర్తులు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు స్వర్ణ పుష్పార్చన సేవ నిర్వహించారు. స్వామి వారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అలంకరించి కల్యాణ మండపంలో వేదికపై అధిష్టింపజేశారు. 108 స్వర్ణ సంపెంగ పుష్పాలతో స్వామికి అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. ఆలయ సూపరింటెండెంట్ పాలూరి నరసింగరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వైభవంగా నిత్య కల్యాణం

శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై అధిష్టింపజేసి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా సాగింది. ఈ పూజల్లో పాల్గొన్న ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

అప్రమత్తతతో అగ్ని ప్రమాదాల నివారణ



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ చిన్నారావు



అగ్ని ప్రమాదాల నివారణపై మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న సేఫ్టీ బృందం

పరవాడ: ఫార్మా పరిశ్రమల్లో తరచూ జరుగుతున్న అగ్ని ప్రమాదాలపై యాజమాన్యాలు అప్రమత్తంగా ఉండాలని ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ చిన్నారావు సూచించారు. జేఎన్ ఫార్మాసిటీలో ఎస్ఎన్ఎఫ్ ఇండియా పరిశ్రమలో అగ్ని ప్రమాదాల నివారణపై గురువారం మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫార్మా పరిశ్రమల్లో సంభవిస్తున్న అగ్ని ప్రమాదాల నివారణ విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రమాద సమయంలో కార్మికులు, ఉద్యోగులు పాటించాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అంతకుముందు అగ్ని ప్రమాదం సంభవిస్తే ప్రమాదాన్ని ఏ విధంగా ఎదుర్కోవాలన్న దానిపై కార్మికులు మాక్ డ్రిల్ ద్వారా కళ్లకు కట్టినట్లు చూపించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎన్ఎఫ్ ఇండియా పరిశ్రమ ఉద్యోగులు, విష్ణు కెమికల్, ఎమ్మెన్నార్, ఎంఏఎస్ఆర్ఎం ప్రతినిధులు, భద్రత అధికారులు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ



సామాజిక తనిఖీ సమావేశంలో పాల్గొన్న డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ సందీప్

పరవాడ: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 2022-23 వార్షిక సామాజిక తనిఖీ ప్రజా వేదిక స్థానిక మరిడిమాంబ కల్యాణ మండపంలో గురువారం జరిగింది. డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ ఇ.సందీప్ ముఖ్యఅతిథిగా పాల్గొని ఉపాధి హామీ పథకం కింద రూ.4.98 కోట్లతో చేపట్టిన పనులకు సంబంధించిన ఆడిట్ రికార్డులను పరిశీలించారు. రూ.1.09 లక్షల అసంపూర్తి రికార్డు నిర్వహణ, రూ.3500 జరిమానాలను ఆడిట్ అధికారులు గుర్తించారు. ఈ కార్యక్రమంలో పరవాడ ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మి, వైస్ ఎంపీపీ బి.అప్పలరాజు, అదనపు ప్రాజెక్టు డైరెక్టర్ రోజా రమణి, నిఘా అధికారి నిర్మలాదేవి, ఎంపీడీవో హేమసుందరావు, సోషల్ ఆడిట్ అధికారి ఎస్.ఆర్.పి.సూర్యానారాయణ, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

పరమేశ్వరునికి విశేషంగా అభిషేకం



ఉమా చంద్రమౌళీశ్వర స్వామి

సింహాచలం : అడవివరంలోని విజినిగిరిపాలెంలో ఉన్న ఉమా చంద్రమౌళీశ్వర స్వామి ఆలయంలో స్వామికి త్రయోదశి ప్రదోషకాల అభిషేకాన్ని గురువారం విశేషంగా నిర్వహించారు. పంచామృతాలతో స్వామికి అభిషేకం చేశారు. భక్తులు విశేషంగా తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ కార్యక్రమాన్ని నిర్వహించారు.

చిన్నారులను అంగన్‌వాడీకి పంపించాలి



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎంపీపీ నాగమణి

సింహాచలం : మూడు సంవత్సరాల వయసు నిండిన చిన్నారులను తప్పనిసరిగా అంగన్‌వాడీ కేంద్రానికి పంపించాలని పెందుర్తి ఎంపీపీ మదుపాడ నాగమణి సూచించారు. ప్రీ ప్రైమరీ ఒన్, ప్రీ ప్రైమరీ 2 విద్యను కేంద్రాల్లో నేర్పిస్తామని తెలిపారు. గ్రాడ్యుయేషన్ డే పూర్తి చేసుకుని ప్రభుత్వ స్కూల్‌లో చేరేందుకు సిద్ధమైన చిన్నారులను పెందుర్తి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంలో సీడీపీవో డి.నీలవేణి ఆధ్వర్యంలో గురువారం అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భాగీ దారి కార్యక్రమంలో ప్రజలను భాగస్వాములను చేస్తూ స్కూల్ ప్రాధాన్యతపై విస్తృతంగా ప్రచారం చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా చిన్నారులు గ్రాడ్యుయేషన్ దుస్తుల్లో విశేషంగా ఆకట్టుకున్నారు. వారికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో మండల సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

సబ్బవరం : మండలంలోని సబ్బవరం-1, సబ్బవరం-2 సెక్షన్ల పరిధిలో 33/11 కేవీ ఫీడర్ పీఎమ్ఐ విద్యుత్ లైన్‌ల నిర్వాహణలో భాగంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని డీఈ నిరీక్షన్ అంబేడ్కర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్బవరం, అంతకాపల్లి సబ్ స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకూ విద్యుత్ సరఫరా నిలిచిపోనున్నట్లు తెలిపారు. ఆయా గ్రామాల వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

వృద్ధులపై ప్రేమ అవసరం



గొల్లపేటలో ర్యాలీలో గ్రామస్తులు

పరవాడ: వృద్ధుల పట్ల ప్రేమతో మెలగాలని హెల్పేజ్ ఇండియా ప్రతినిధి జి.అభిషేక్ కోరారు. సింహాద్రి ఎన్టీపీసీ, హెల్పేజ్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో వాడచీపురుపల్లి జెడ్పీ పాఠశాల, గొల్లపేట గ్రామాల్లో గురువారం ప్రపంచ వృద్ధుల వేధింపుల నివారణ దినాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వృద్ధులు తాము ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం 14567 హెల్ప్ లైన్ నంబరును ఉపయోగించుకోవాలని సూచించారు. గొల్లపేటలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. జెడ్పీ పాఠశాల హెచ్ఎం కనకేశ్వరరావు మాట్లాడుతూ వయో వృద్ధులను వేధించడం, నిర్లక్ష్యం చేయడం వంటి సమస్యలపై స్వచ్ఛంద సంస్థలు ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు.

పూర్వ ప్రాథమిక విద్య విజయవంతం చేయాలి



మల్లనాయుడుపాలెంలో ర్యాలీలో సచివాలయ, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు

సబ్బవరం: జన్ భాగీదరి ద్వారా ప్రభుత్వం రూపొందించిన పూర్వ ప్రాథమిక విద్యను అంగన్‌వాడీ కార్యకర్తలంతా జయప్రదం చేయాలని మల్లునాయుడుపాలెం పంచాయతీ కార్యదర్శి మానస కోరారు. మండలంలోని మల్లునాయుడుపాలెంలో జన్ భాగీదరి కార్యక్రమంపై గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మూడేళ్లు నిండిన పిల్లలను అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించాలని కోరారు. ఇంటింటికీ వెళ్లి చిన్నారుల తల్లిదండ్రులకు ఈ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీస్ ధనలక్ష్మి వెల్ఫేర్ అసిస్టెంట్ శివ, అంగన్‌వాడీ కార్యకర్తలు వి సుభాషిణి, ఎస్.అక్కమ్మ, ఆర్.రవణమ్మ పాల్గొన్నారు.

మత్తు పదార్థాల నియంత్రణపై స్పెషల్ డ్రైవ్



విశాఖ రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్న జీఆర్పీ సిబ్బంది

తాటిచెట్లపాలెం: మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల నియంత్రణ కోసం విశాఖ రైల్వేస్టేషన్‌లో గవర్నమెంట్ రైల్వే పోలీసులు గురువారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. సూపరింటెండెంట్ ఆఫ్ రైల్వే పోలీస్ రాహుల్‌దేవ్, డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ రైల్వే పోలీస్ బి.మోహనరావుల ఆదేశాల ప్రకారం రైల్వే స్టేషన్‌లోని పలు ప్లాట్‌ఫాంలపై ఈ కార్యక్రమం చేపట్టారు. మత్తుపదార్థాలు కుటుంబాలను ఎలా చిన్నాభిన్నం చేస్తాయో, వాటి వినియోగం, రవాణా చేయడం వల్ల ఎలాంటి పరిస్థితులను ఎదుర్కోవాల్సి వస్తుందో జీఆర్పీ సిబ్బంది ప్రయాణికులకు వివరించారు. ఇటువంటి వాటికి అలవాటు పడితే కలిగే అనర్థాలను తెలిపేందుకు అవగాహన కల్పించి, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, మంచి భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని పిలుపునిచ్చారు. మత్తు పదార్థాలు కలిగి ఉండటం, రవాణా చేయడం కూడా నేరమని, ఇటువంటి నేరాలకు పాల్పడిన వారిని కఠిన శిక్షలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో జీఆర్పీ సీఐ కోటేశ్వరరావు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

సిరులతల్లికి ఘనంగా సహస్ర తులసీపూజ



సహస్ర తులసి పూజలో సిరులతల్లి

దాబాగార్డెన్స్: బురుజుపేటలోని కనకమహాలక్ష్మి అమ్మవారికి గురువారం సహస్ర తులసీపూజ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. అలాగే పంచామృతాభిషేక సేవా, శ్రీచక్రానవవర్ణార్చన లక్ష్మీహోమంలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి తిరుమలేశ్వర రావు, ఆలయ పర్యవేక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు క్షీరాభిషేక సేవ

కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించనున్నారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.500 చెల్లిస్తే పూజకు దంపతులను లేదా ఇద్దర్ని అనుమతించనున్నారు. పూజలో పాల్గొనదలచే భక్తులు 0891-2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు.

వరాహ పుష్కరిణిలో పెద్ద ఎత్తున చేపలు మృతి



వరాహ పుష్కరిణిలో మృతి చెందిన చేపలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన కొండదిగువ వరాహ పుష్కరిణిలో గత మూడు రోజులుగా పెద్ద ఎత్తున చేపలు మృతి చెందుతున్నాయి. మృతి చెందిన చేపలు గుట్టలుగుట్టలుగా ఒడ్డుకి కొట్టుకొస్తున్నాయి. దీంతో పుష్కరిణి అంతా పెద్ద ఎత్తున దుర్వాసన వెదజల్లుతోంది. భక్తులు స్నానాలు కూడా ఆచరించలేని పరిస్థితి నెలకొనడంతో గురువారం దేవస్థానం అధికారులు మృతి చెందిన చేపలను తొలగించే పనులు యుద్ధప్రాతిపదికన చేపట్టారు. స్థానికంగా ఉన్న గజ ఈతగాళ్లను వరాహ పుష్కరిణిలో దింపి మృతి చెందిన చేపలను తొలగించే పనులు చేయిస్తున్నారు. వరాహ పుష్కరిణిలో గతంలో చేపలు మృతి చెందిన సంఘటనలు ఉన్నా.. ఈసారి అధిక ఉష్ణోగ్రత వల్ల ఎక్కువగా చేపలు మృతి చెందామని దేవస్థానం అధికారులు చెబుతున్నారు. దేవస్థానం ఏఈవో నరసింహరాజు, ఈఈ రాంబాబు, ఏఈ రవితేజ చేపలను తొలగింపు పనులను పర్యవేక్షించారు.

మొక్కల సంరక్షణతోనే పర్యావరణ పరిరక్షణ



కాలేజీ ప్రాంగణంలో మొక్క నాటుతున్న డాక్టర్ రావ్, ప్రొఫెసర్ సాంబశివరావు

మురళీనగర్: మొక్కలను సంరక్షించినప్పుడే పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని ఐఎస్‌టీడీ వైజాగ్ చాప్టర్ చైర్మన్ డాక్టర్ వోఎం రావ్ అన్నారు. ప్రపంచ పర్యావరణ వారోత్సవాల్లో భాగంగా ఐఎస్‌టీడీ వైజాగ్ చాప్టర్, కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ ఎన్ఎస్ఎస్ విభాగం సంయుక్తంగా గురువారం నిర్వహించిన మొక్కల పెంపకం కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన ప్రసంగించారు. విద్యార్థులు నిర్వహించే సామాజిక సేవా కార్యక్రమాల్లో మొక్కల పెంపకం, వాటి సంరక్షణ బాధ్యతను ప్రధాన అంశంగా తీసుకోవాలని సూచించారు. ఒక చెట్టును నరికితే దాని స్థానంలో మరో చెట్టుతోపాటు పది మొక్కలు నాటాలన్నారు. ప్రొఫెసర్ ఎస్.సాంబశివ రావు మాట్లాడుతూ గ్లోబల్ వార్మింగ్ నియంత్రణకు పచ్చదనం పరిరక్షణ ప్రధానమని వివరించారు. ప్లాస్టిక్ వస్తువుల వాడకం తగ్గించుకోవాలన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో డాక్టర్ రావ్, ప్రొఫెసర్ ఎస్.సాంబశివరావు కాలేజీ ప్రాంగణంలో మొక్కలు నాటారు. కెమికల్ ఇంజినీరింగ్ హెడ్ డాక్టర్ బీవీ లక్ష్మణరావు, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

చీటీల నిర్వాహకురాలిపై ఫిర్యాదు

సింహాచలం: చీటీల నిర్వాహకురాలిపై పెందుర్తి పోలీసులకు గురువారం బాధితులు ఫిర్యాదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. పెందుర్తిలో లాలం గోవిందమ్మ చీటీల పేరిట డబ్బులు వసూలు చేసింది. గతేడాది సెప్టెంబరు నెల నుంచి చీటీల డబ్బులు ఇవ్వకపోవడంతో బాధితులు పదేపదే నిలదీయడంతో ఈ ఏడాది జనవరిలో ఇస్తానని చెప్పింది. ఆ తర్వాత కనిపించకుండా ఎక్కడికో వెళ్లిపోయింది. మళ్లీ ఫిబ్రవరిలో వచ్చిన ఆమె తన ఆస్తులు అమ్మేసి చీటీల డబ్బులు ఇస్తామని చెప్పడంతో బాధితులు శాంతించారు. గురువారం పెందుర్తిలోని గోవిందమ్మకు చెందిన ఒక దుకాణం వద్ద కొంత మంది చీటీల బాధితులు ఆమెను నిలదీశారు. సరైన సమాధానం రాకపోవడంతో పెందుర్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. మొత్తం రూ.2 కోట్ల నుంచి రూ.3 కోట్ల వరకు గోవిందమ్మ చీటీల రూపంలో బాధితులకు చెల్లించాల్సి ఉందని ప్రచారం జరుగుతోంది.

దిశ యాప్‌పై విస్తృత ప్రచారం



మహిళలు, విద్యార్థినులకు దిశ యాప్‌పై అవగాహన కల్పిస్తున్న ద్వారకా పోలీసులు

సీతమ్మధార: మహిళల రక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన దిశ యాప్‌పై పోలీసులు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్ పరిధి శ్రీనగర్‌లో గురువారం మహిళలు, విద్యార్థినులు, యువతీ యువకులకు అవగాహన కల్పించి వారి సెల్‌ఫోన్‌ల్లో యాప్‌ను డౌన్‌లోడ్ చేయించారు. సీఐ సిహెచ్.సింహాద్రినాయుడు ఆదేశాల మేరకు ద్వారకా మహిళ పోలీసులతోపాటు కానిస్టేబుళ్లు శ్రీనగర్, రామా టాకీస్, సత్యం జంక్షన్, గురుద్వారా ప్రాంతాల్లో దిశ యాప్‌ను డౌన్‌లోడ్ చేయించి రిజిస్టర్ చేయించారు. వ్యక్తిగత వివరాలను గోప్యంగా ఉంచుతామని పోలీసులు తెలిపారు. ఆపద సమయంలో పోలీస్ వారి తక్షణ సహాయం దిశ ఎస్‌వోఎస్ బటన్ ప్రెస్ చేసిన వెంటనే కంట్రోల్ రూమ్‌కు సమాచారం వెళుతుందన్నారు. బటన్ ప్రెస్ చేయలేని స్థితిలో ఉంటే, ఫోన్ గట్టిగా అటూ ఇటూ ఊపినా పోలీసులకు సందేశం చేరుతుందని వివరించారు. పోలీసులు వెంటనే అక్కడికి వచ్చి సహాయం అందిస్తారని చెప్పారు.

24న డ్యాన్సింగ్ సూపర్ స్టార్ గ్రాండ్ ఫైనల్స్

దాబాగార్డెన్స్: విశాఖలో డ్యాన్సింగ్ సూపర్ స్టార్ సీజన్ 6 గ్రాండ్ ఫైనల్స్ గురజాడ కళాక్షేత్రం వేదికగా నిర్వహించనున్నట్టు పేస్ క్రియేటర్స్ డ్యాన్స్ అకాడమీ ఫౌండర్ రంజన్ నాయక్ తెలిపారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ వ్యాప్తంగా 20 ప్రధాన నగరాల్లో ఆడిషన్స్ నిర్వహించామని, 20 టీములను గ్రాండ్ ఫైనల్‌కు ఎంపికయ్యారన్నారు. ఈ ఈవెంట్‌కు ప్రధాన న్యాయ నిర్ణేతగా ప్రముఖ బాలీవుడ్ కొరియోగ్రాఫర్ ధర్మేష్ వ్యవహరిస్తున్నారని, ఈ కార్యక్రమానికి రాష్ట్ర మత్స్యశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు, విశాఖ దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ పాల్గొంటున్నట్టు తెలిపారు. ఇండియన్ హిప్ హాప్ ఇంటర్నేషనల్ విన్నర్స్ సాగర్ బోరా, కార్తీక్ రాజా, రవివర్మ, దీపక్ రాజ్‌పుత్ తదితరులు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరిస్తున్నారని చెప్పారు. ఈవెంట్ ప్రధాన స్పాన్సర్ సునీత మాట్లాడుతూ పిల్లల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని, టాలెంట్‌ను వెలికి తీసే ఈ తరహా ఈవెంట్లకు మా సహకారం ఎప్పుడూ ఉంటుందన్నారు. గెలుపొందిన విజేతలకు ఫస్ట్ ప్రైజ్‌గా రూ.లక్ష, సెకండ్ ప్రైజ్‌గా రూ.50వేలు, థర్డ్ ప్రైజ్‌గా రూ.25వేలు అందజేయనున్నట్టు చెప్పారు. సమావేశంలో ఈవెంట్ హౌస్ మేనేజింగ్ డైరెక్టర్ రవిశంకర్, అగర్వాల్ హాస్పటల్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ జేమ్స్ ఆడమ్స్, రౌండ్ టేబుల్ ఇండియా ప్రతినిధి ప్రతీక్‌సింగి, రూపేష్, చాందిని పాల్గొన్నారు.